క్లుప్తంగా

23న వైశాఖ పౌర్ణమి సభ

పిఠాపురం: విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠంలో గురువారం వైశాఖ పౌర్ణమి సభను నిర్వహించనున్నట్టు పీఠం కన్వీనర్ పి.సూరిబాబు తెలిపారు. ఈ సభ పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభం అవుతుందన్నారు.

నేడు ముత్యాలమ్మ తల్లి జాతర

కొత్తపల్లి: భక్తుల పూజలందుకుంటున్న స్థానిక ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం రాత్రి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించి, గురువారం తీర్థాన్ని నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయానికి రంగులువేసి, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు.

వినియోగదారుల సంఘ నేత రంగనాయకులు మృతి


రంగనాయకులు (ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని వాకతిప్ప గ్రామానికి చెందిన మండల వినియోగదారుల రక్షణ సమితి మాజీ అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు రావు రంగనాయకులు(75) మంగళవారం తెల్లవారుజామున స్వగృహంలో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తెలుగు భాషా పరిజ్ఞానం అవసరం


తెలుగు పద్యాలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు సుబ్బారావు

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థుల పిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంఏ తెలుగు అధ్యాపకుడు టి.సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక వేతనం పొందేలా శ్రమ పడాలి


పనులు పరిశీలిస్తున్న ఏపీఓ కొండలరావు

గొల్లప్రోలు: ఉపాధి హామీ పథకం కూలీలు అధిక వేతనం పొందేలా పనులు చేయాలని ఉపాధిహామీ ఏపీఓ కొండలరావు సూచించారు. మండలంలోని చేబ్రోలు గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడు రోజుకు రూ.300 వరకు వేతనం పొందవచ్చన్నారు. పనులు జరిగే ప్రాంతంలో తాగునీటి వసతిని ఏర్పాటు చేయాలన్నారు. తప్పుడు మస్టర్లు వేసినట్టయితే సహించేది లేదని సిబ్బందికి హెచ్చరించారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జగదీష్

గొల్లప్రోలు: ఆరోగ్యకర బిడ్డ కోసం గర్భిణులు జాగ్రత్తలు పాటించాలని చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జగదీష్ అన్నారు. మండలంలోని చేబ్రోలు గ్రామంలో సచివాలయం-3 పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం చేబ్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 120 మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, నీరుడు పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ జగదీష్ వివరించారు. వేసవిలో కురిసే వర్షాల్లో తడవకూడదని చెప్పారు. రక్తహీనత లేకుండా ఆకుకూరలు, పాలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ నవీన దీప్తి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్

- గ్రామాల్లో విస్తృతంగా వైద్య సేవలు
- నెలలో రెండు సార్లు ఇంటి వద్దే పరీక్షలు
- దీర్ఘకాలిక రోగులకు ఉపశమనం
- నియోజకవర్గంలో ప్రతి క్యాంపులో 150కి పైగా ఓపీ


కొత్తపల్లిలో అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారు. ఇంటింటికీ నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న సంకల్పంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని ద్వారా సచివాలయం పరిధిలోని ప్రజలకు నెలకు రెండు పర్యాయాలు వారి ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో వైద్యసేవలు విస్తృతమవ్వడంతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది.

పిఠాపురం నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో వైద్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో 150 నుంచి 200 మంది ఓపీ వస్తున్నట్టు వైద్యులు తెలిపారు.

ఉచితంగా మందుల పంపిణీ

ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఇద్దరు వైద్యులు, ఏఎన్‌ఎం, డీఈఓ, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తల సహకారంతో వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఓపీ సేవలు అందిస్తున్నారు. అనంతరం సాయంత్రం 5 వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాల వల్ల మంచాన పడిన రోగుల వద్దకు వెళ్లి చికిత్స అందిస్తున్నారు. అంతే కాకుండా 14 రకాల పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేస్తున్నారు. దీంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. దీంతో ఈ కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శివారు గ్రామాల్లోని రోగులకు వారి ఇళ్ల వద్దే వైద్య సేవలు అందుతున్నాయి.

నాణ్యమైన వైద్య సేవలు

నేను చాలా కాలంగా బీపీ, షుగరుతో బాధపడుతున్నాను. సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి వెళ్లి వైద్య సేవలు పొందుతున్నాను. వైద్యులు ఎంతో ఓపికగా పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం ఇంటి వద్దే అందుతుంది.

– శీకోటి రాజు, జొన్నలగరువు, ఎండపల్లి

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

గత కొంత కాలంగా బీపీతో బాధపడుతున్నాను. మా కుటుంబంలో మేము రోజూ పనికి వెళితే కానీ ఇల్లు గడవదు. బీపీ రావడంతో కూలికి వెళ్లిన సొమ్ము మొత్తం రోగాలకే సరిపోయేవి కావు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల వైద్యులు 104 వాహనంలో ఇంటి వద్దకే వచ్చి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. మాలాంటి పేదవారికి ఎంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

ఏ.అప్పయ్యమ్మ, జొన్నలగరువు ఎండపల్లి

వైద్య సేవలపై అవగాహన

ప్రభుత్వం అందించే వైద్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వస్తోంది. సొంత గ్రామంలోనే వైద్య పరీక్షలు అందించడంతో రోగులు వస్తున్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నాం. అంగన్‌వాడీ పిల్లలకు కూడా వైద్య పరీక్షలు చేస్తున్నాం. వారికి అవసరమైన మందులు అందిస్తున్నాం.

– సుష్మ, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తపల్లి

విద్యుత్తు స్తంభం మార్పు


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని మార్పు చేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని మంగళవారం ట్రాన్స్‌కో అధికారులు మార్చారు. ఈ రోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభం వంకర తిరిగి తుప్పుపట్టి రంధ్రం పడి పాడైపోయింది. ఎప్పుడు పడిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై 'ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో ఏపీఈపీ డీసీఎల్ ఈఈ ప్రభాకర్ స్పందించారు. వెంటనే స్తంభాన్ని మార్చాలని ఆదేశించారు. అయితే స్తంభం ఎదురుగా ఉన్న షాపు యజమాని పాత స్తంభం స్థానంలో కాకుండా మరో చోట స్తంభాన్ని మార్చాలని డిమాండ్ చేయడంతో అతని వద్ద లోకేషన్ చేంజ్ ఫీజు కట్టించుకుని మరో ప్రదేశంలో ఏర్పాటు చేశారు. ఈ పనులను నాలుగో వార్డు కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ పర్యవేక్షించారు.

నోట్ పుస్తకాల విడుదల

సామర్లకోట: మండల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల కోసం నోట్ పుస్తకాలు విడుదలైనట్టు మండల విద్యాశాఖాధికారులు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల కోసం వచ్చిన నోట్ పుస్తకాలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉంచినట్టు తెలిపారు. 200 పేజీల బ్రాడ్ రూల్ పుస్తకాలు 5,312, 200 పేజీల లాంగ్ రూల్ పుస్తకాలు 24,625, 200 పేజీల తెల్ల లాంగ్ పుస్తకాలు 22,714, 40 పేజీల తెల్ల లాంగ్ పుస్తకాలు 3,401 వచ్చాయని వారు వివరించారు. అదే విధంగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు రావలసి ఉన్నదని, వాటిని స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిల్వ చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. గత ఏడాది ప్రకారం ఒకటో తరగతిలో 216 మంది బాలురు, 251 మంది బాలికలు, రెండో తరగతిలో 271 మంది బాలురు, 263 మంది బాలికలు, మూడో తరగతిలో 286 మంది బాలురు, 323 మంది బాలికలు, నాలుగో తరగతిలో 331 మంది బాలురు, 358 మంది బాలికలు, ఐదో తరగతిలో 451 మంది బాలురు, 494 మంది బాలికలు ఉన్నారని చెప్పారు. ఆరో తరగతిలో 482 మంది బాలురు, 487 మంది బాలికలు, ఏడో తరగతిలో 578 బాలురు, 556 మంది బాలికలు, ఎనిమిదో తరగతిలో 557 మంది బాలురు, 621 మంది బాలికలు, తొమ్మిదో తరగతిలో 568 మంది బాలురు, 532 మంది బాలికలు, 10వ తరగతిలో 541 మంది బాలురు, 562 మంది బాలికల హాజరు శాతం ఉన్నదని చెప్పారు. మండల పరిధిలో 8,728 మంది విద్యార్థులు గత విద్యా సంవత్సరంలో ఉన్నారని వివరించారు.

తుప్పల మాటున కలప కొల్లగొట్టి..

- తుప్పల పేరు చెప్పి భారీ వృక్షాలను యథేచ్ఛగా తరలిస్తున్న కాంట్రాక్టర్
- అనుమతులిచ్చేసి.. ఆనక పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు
- పైగా చర్యలు తీసుకుంటామని బీరాలు
- తరలించాక చర్యలేం తీసుకుంటారో మరి!


నాగార్జున ఫిల్టరు చెరువు గట్టుపై చెట్లు నరికి తీసుకుపోతున్న కాంట్రాక్టర్ సిబ్బంది

సామర్లకోట: స్థానిక నాగార్జున ఫిల్టర్ బెడ్ చెరువు గట్టుపై జోరుగా చెట్లు నరికివేసి అక్రమంగా కలపను తరలించేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సుమారు 50 ఏళ్ల క్రితం నాగార్జున ఫ్యాక్టరీ కోసం సుమారు 350 ఎకరాల విస్తీర్ణంలో చెరువును ఏర్పాటు చేశారు. 2000 సంవత్సరంలో ఈ చెరువులో మున్సిపాలిటీ తాగునీటికి ఉపయోగించుకొనే హక్కును కల్పించారు. అప్పటి నుంచి చెరువులో నీటిని శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఇటువంటి చెరువు గట్టుపై అనేక చెట్లను నాటారు. కొన్ని రోజులుగా ఈ చెట్లను నరికి తరలించేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా ఈ చెరువుపై మున్సిపాలిటీకి ఎటువంటి అధికారం లేదని, చెరువుపై హక్కులు పబ్లిక్ హెల్త్ అధికారులకే ఉన్నాయని తెలిపారు. దీనిపై పబ్లిక్ హెల్త్ డీఈ హుస్సేన్‌ను వివరణ కోరగా చెరువు గట్టుపై తుప్పలు పెరిగిపోవడంతో వాటిని తొలగించడానికి కాంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించామని, అయితే చెట్లు నరికితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగ చెరువులో చేపలు చనిపోవడంతో నీరు చెడు వాసన వస్తోందని, ఆ చేపలను తొలగించే చర్యలు తీసుకుంటామని వివరించారు.

అనధికార కట్టడాన్ని కనరూ..

- జీ ప్లస్ 2కు అనుమతి.. మరో అంతస్తు నిర్మాణం
- నోటీసు ఇచ్చినా బేఖాతరు


పనసపాడులో అనుమతి లేకుండా జీ ప్లస్ 3 నిర్మాణం

సామర్లకోట: మండల పరిధిలో పనసపాడు పంచాయతీ పరిధిలో అనధికార కట్టడం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అచ్చంపేట ఏడీబీ రోడ్డుకు సమీపంలో గ్రామం ఉండటంతో భూమి విలువ ఎక్కువగా ఉంది. దాంతో పనసపాడు గ్రామంలో స్థలం ఉన్న యజమాని జీ ప్లస్ 2 ఇంటి నిర్మాణానికి పంచాయతీకి ప్లాన్ పెట్టి అనుమతి పొందాడు. అయితే దానిపై మరో అంతస్తును అక్రమంగా నిర్మిస్తున్నా అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అమరాథ్ రెడ్డిని వివరణ కోరగా అనుమతి లేకుండా మరో అంతస్తు నిర్మిస్తున్నది వాస్తవమేనని దీనిపై యజమానికి నోటీసులు ఇచ్చామని, 350 అడుగుల లోపు స్థలంలో నిర్మాణాలకు పంచాయతీ అనుమతులు ఇవ్వవచ్చని, కానీ అనుమతికి మించి నిర్మిస్తుండడంపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో తంటికొండ వెంకన్న

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి నిత్యోపాసన, బలిహరణ, సాయంత్రం పండిత సభ, విశేషార్చనలు నిర్వహించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పొన్నచెట్టు వాహనంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో నాలుగో రోజు వైశాఖ శుద్ధ త్రయోదశి, మంగళ వారం రాత్రి శ్రీసత్యదేవుడు, అమ్మవారిని పొన్నచెట్టు వాహనంపై ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటలకు శ్రీసత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండదిగువన తొలిపాంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన పొన్నచెట్టు వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. అనంతరం పొన్నచెట్టు వాహనం ముందు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. శ్రీసత్యదేవుని తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకూ, అక్కడి నుంచి మరలా తొలిపావంచా వరకూ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు.


పొన్నచెట్టు వాహనంపై ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

విగ్రహం ధ్వంసంపై ఆందోళన

పిఠాపురం: పట్టణంలోని అగ్రహారం పశువుల సంత వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై దళితులు ఆందోళన చేపట్టారు. దోషులను తక్షణం గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నచోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పలువురు నాయకులు పేర్కొన్నారు.

ఆత్మ స్థైర్యానికి వేసవి శిక్షణ దోహదం


రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న జమీల్


బియ్యపు గింజలతో సీతాకోకచిలుకను తయారు చేసిన విద్యార్థులు

పెద్దాపురం: విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు వేసవి శిక్షణలు దోహదపడతాయని పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) అధ్యక్ష, కార్యదర్శులు కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం విద్యార్థులకు రోబోటిక్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ విద్యార్థి దశ నుంచి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఏటా పీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి శిక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహ్మద్ జమీల్ ఆలీ విద్యార్థులకు రోబోటిక్స్, తాడిగడప సుబ్బారావు తెలుగు పద్యాలు, రంగురంగుల బియ్యపు గింజలతో సీతాకోకచిలుక తయారీ చేయించగా వీటిని బుద్దా శ్రీనివాస్, శ్యామ్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ఉదయం పూజిత సూర్యశ్రీ కరాటే శిక్షణ, నీలపాల కృష్ణ కర్రసాము నేర్పించారు.

పోస్టల్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

జేసీ రామ్‌సుందర్‌రెడ్డి


పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మంగళవారం కాకినాడ జేఎన్టీయూలోని సివిల్ డిపార్టుమెంట్ పీజీ బ్లాక్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌కు వినియోగించిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని జేఎన్టీయూలో నియోజకవర్గాల వారీగా ఆయా బ్లాకుల్లో సురక్షితంగా భద్రపరచినట్టు తెలిపారు. అలాగే కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఉద్యోగులకు సంబంధించి పోస్టల్‌బ్యాలెట్లను జేఎన్టీయూలోని సివిల్ డిపార్టుమెంట్ పీజీ బ్లాక్‌లోను, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల వద్ద ఓట్లు లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి

పార్టీల నేతలతో ఎస్పీ సతీష్‌కుమార్


ప్రత్తిపాడులో జరిగిన సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు


జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

జగ్గంపేట: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జగ్గంపేటలోని శివపార్వతి కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. అదే తరహాలో కౌంటింగ్ ప్రక్రియకు కూడా సహకరించాలని కోరారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. అల్లర్లకు, హింసాత్మక సంఘటనలకు పాల్పడరాదని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే అనుమతులు తప్పనసరిగా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ, విజయోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు, ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిత్రా, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై నాగార్జునరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

ప్రత్తిపాడు: చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రత్తిపాడు సరయు కన్వెన్షన్ హాల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే చర్యలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం సతీష్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు ఎం పవన్‌కుమార్, సతీష్, కిషోర్, నబీతో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు వరుపుల సూరిబాబు, బెహరా దొరబాబు, పైలా బోస్, వాసిరెడ్డి భాస్కరరావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.